# దొంగోలమీది దొడ్డురాజు




కటికచీకట్లో
కప్పుతన్నేసిన
వీడికీ
తన్నించుకున్న
వాడికీ
మాటకలిసిందా..
చెయ్యి కలిసిందా?

**కాకాని చక్రపాణి**

ఎండాకాలం. రాత్రి ఎనిమిది గంటల సమయం. రష్‌గా వున్న ఆ ఇరానీ రెస్టారెంట్‌లో దీపాలారిపోయాయి. ప్రాణం పోకడలా కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో 'దేవోనజానాతి, కుతోమనుష్యః' అన్న పరిస్థితి. పోయిన రెండుక్షణాల్లో మళ్లీ కరెంటు వచ్చింది. దీపాలు వెలిగాయి. ఆ రెండు క్షణాల్లో జరిగిపోయింది ఘోరం. గోడ వారగావున్న టేబిల్ దగ్గర కూర్చుని చాయ్ తాగుతున్నాడో వ్యక్తి. టేబిల్ మీది కప్పు వ కి అతని చొక్కా పాడయిం ది. అతనికి కోపంవచ్చింది. ఎదుటి టేబిల్ దగ్గరున్న వ్యక్తితో మాట్లాడి చీకట్లో హోటల్ బయటకెళ్లిన మనిషి చెయ్యి తగిలే టీ వలికిందని అతని ఉద్దేశం. లేచి వెళ్లి ఎదుటి టేబిల్ ముందు నిలబడ్డాడు.

''ఏడీవాడు?'' అనడిగాడు అతన్ని

''ఎవడు వాడు?'' అర్థంకాక అడిగాడతను

''నా కప్పు తన్నేసి పోయినవాడు''

''ఎవడువాడు?''

''అదే నేనడిగేది''

''నాకేం తెల్సు''

''నీకు తెలీక పోవటమేం. ఇంతక్రితం నీతో మాట్లాడుతున్నాడుగా''

''నాతో ఎవరూ మాట్లాడలేదు''

''బూకరించకు. నేను చూడలేదనుకోకు''

''చూస్తే నన్నడుగుతావెందుకు?''

నిన్నుకాక ఎవర్ని అడగాలి?''

''మధ్యనాకేం సంబంధం?''

''ఏం వాడు నీ బావమరదా? వత్తాసు వస్తున్నావు?''

''నా బావమరిది ఎవడూ లేడిక్కడ''

మరింకేం ఎవడో చూపించు. వాడి తాట వలుస్తా''

''నాకు వాడెవడో తెలీదంటే నీకేం పిచ్చా''

''నాకు పిచ్చంటావా? నీకు పిచ్చి, నీ యమ్మకు పిచ్చి, నీ బాబుకు పిచ్చి, నీ అన్నకు పిచ్చి, నీ అక్కకు పిచ్చి...'

''ఓహో మీరందరూ ఒకేచోటవుండేవాళ్ళా? నువ్వెప్పుడు పారిపోయి వచ్చావు అక్కడ నుండి?''

''ఎక్కడనుండి?''

''పిచ్చాసుపత్రి నుండి''

''ఓరి బద్మాష్! నేను పిచ్చాసుపత్రి నుండి వచ్చిన బాపతులా కనిపిస్తున్నానా?''

'మరి ఎవడో దిక్కుమాలిన వాడ్ని గురించి నన్ను ఆరా తీయుటమెందుకు? నువ్వే బడా బడా బద్మాష్‌వి.

''నన్ను తిడ్తావా గాడ్దీ! నీ కసలు సభ్యసంస్కారాలు లేనట్టున్నాయి!''

''ఎవరికి లేవో కన్పిస్తూనే వుంది''

''మీరిద్దరూ అనవసరంగా కుక్కల్లా కొట్లాడుకోక విషయం ఏమిటో చెప్పండి. దోషి ఎవడోనేను నిర్ణయిస్తాను'' అన్నాడు అక్కడే ఛాయ్ తాగుతున్న మూడోవ్యక్తి.

''మమ్మల్ని కుక్కలంటావా, గాడ్దీ, పందీ, ఎద్దూ, దున్నపోతూ..వాలా?'' అడిగాడు మొదటివాడు, రెండోవాణ్ణి.

"చాలదు.. పిల్లీ, ఎలుకా, పందికొక్కూ, కంది రీగా, దోమా, నల్లీ!" అన్నాడు రెండోవాడు తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తూ.

మూడోవాడు రెండోవాణ్ణి గిచ్చాడు.

"ఓర్నీయమ్మ కడుపుడకా! ఎంతగిచ్చావురా?"

"మరి కందిరీగలు, నల్లులు, దోమలు కుట్టవా?"

"నిన్నూ నల్లిలా నలిపిపారేస్తాను."

"ఓర్నాయనో, ఈ లుచ్చా వెధవలిద్దరూ నా ప్రాణం తీస్తున్నార్రోయ్"

"వీడే అయ్యుంటాడు నీకప్ తన్నింది"

"నా కప్పెందుకు తన్నావు బే"

"నేనెందుకు తన్నాను?"

"నువ్వే తన్నావు. నా చొక్కా ఖరాబయింది. దానికి ఈ పెద్ద మనిషే సాక్ష్యం."

"మా బాగాదొరికాదు నీకు, పిల్లికి ఎలుక సాక్ష్యంలా"

"నేను పిల్లినా?"

"నన్నూ ఎలుకన్నాడూ"

"పట్టుకో వెధవని, రెండు తగిలిస్తేగాని తప్పవప్పుకోడు."

"నువ్వటు నుండిరా, నేనిటు కాస్తాను."

"ఏమిటయ్యా మీ కాకిగోల, ఎవరికీ ఏం తోచనివ్వకుండా" అన్నాడు నాలుగోవ్యక్తి పక్క టేబిల్ నుండి.

"నీ పని నువ్వు చూసుకోబే!"

"అసలు విషయం నువ్వు గుర్తించలేదు బ్రదర్. మనం కాకులంట. ముగ్గుర్నీ అన్నావా కాకులని!"

"అనుమానమేం లేదు. ముగ్గురూ కాకులే. ముక్కాకులు."

"అవాకులు చెవాకులు పేలక, నా సంగతి తెలీదు నీకు."



మంచి పాపులారిటీ ఉన్న ఓ డాక్టరింట్లో అర్ధరాత్రి దాటాక ఫోన్ మోగింది. చిరాగ్గా ఫోనెత్తాడు డాక్టరుగారు

'సార్... నేను గుర్నాథాన్నిసార్... నా భార్యకి అర్జెంట్‌గా అపెండిసైటిస్ ఆపరేషన్ చేయాల్సార్...!'

'అదేమిటంటే మీ ఆవిడకి ఆ ఆపరేషన్ చేసి ఆర్నెల్లేగా అయింది... మళ్లీ ఆపరేషన్ ఏంటి ... అదీ ఒకే వ్యక్తికి రెండో సారి....' అన్నాడు డాక్టర్ గారు.

'ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉండొచ్చని మీరెప్పుడూ విన్లేదా...?' కోపంగా విన్పించింది ఫోన్లో గొంతు డాక్టర్ గారికి

ఎస్.వి. మహేష్‌బాబు, అనంతపురం

"ఏందోయ్ నీ సంగతి మహ"


"వుండు, ఈ సమోసాలు తిననీ నీ పని చెప్తా"

"ఊ కానీ, నా కభ్యంతరంలేదు."

"నే తినేదాకా ఆగటమెందుకు మీరిద్దరూ వాడి సంగతి తేల్చుకోవచ్చుకదా! మనం ముక్కాకులమట. రోషం, పౌరుషం లేదూ మీకు? తెలుగువాడి శౌర్య ప్రతాపాలేమయిపోయాయి."

"నువ్వూ తెలుగువాడివేనా?"

"అచ్చం పదహారణాల తెలుగాడినే."



వీడు ఆంధ్రోడ్లులా వున్నాడు. అచ్చం పదహారణాల వాడు ఆంధ్రుడే

"నోర్ముయ్ మా రాయలసీమవాళ్ళు మాత్రం పదారణాల తెలుగువాళ్లు కాదా?"

ఆమాటకొస్తే తెలంగాణోళ్లం మాత్రం రూపాయికి వందపైసలూ తెలుగోళ్లమే. కల్ దీర్ నహీ, హల్ సిక్కా

"ఛట్ మీ తెలుగూ మీరు? సగం ఉర్దూ కలుస్తుంది మీ మాటల్లో.

"నీ మాటల్లో అరవం, కన్నడం పదాలు కలవ్వా?"

'అందుకనే నేనేది. మా ఆంధ్రా వాళ్ళ తెలుగు, పదహారణాల తెలుగని.

ఈ ఆంధ్రోళ్లు మన్ని దోచేస్తున్నారు.

అవున్నిజమే. సిక్స్ పాయింట్ ఫార్ములా దోవ దాన్దే. ఎక్కడ బట్టినా నౌకరీల్లో వీళ్లే.

పైగామనం ముక్కాకులమట. వాడి సంగతి తేల్చుకోవాల్సిందే.

పోనీలే తెలుగోడే గందా. తెలుగోడన్న తరువాత, వాడికీ వుంటాయిగా పౌరుషం, అభిమానం.

మన్ని కాకులన్న తరువాత వాడు తెలుగువాడు కానీ, తమిళుడు కానీ, కన్నడిగుడుగానీ వాడి అంతు తేల్చాల్సిందే.

అవును ఆంధ్రోళ్ల తర్వాత వాళ్లదే అన్ని చోట్లా డామినేషన్, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్‌లో, సెంట్రల్ గవర్నమెంట్‌లో అన్నిట్లో వాళ్లే.

"పౌరుషం అభిమానం లేనివాళ్ళు, వాళ్ల దేశం వదిలి పెట్టి మనమీదపడి తింటున్నారు.

వై! ఈజ్ ఆంధ్రా యువర్ ఏన్సెస్ట్రల్ ప్రాపర్టీ ఈజిట్ నాట్ పార్ట్ ఆఫ్ ఇండియా అన్నాడు తమిళుడు.

నమ్మవిషయదాగ మాతాడబేడ అన్నాడు కన్నడిగుడు.

వక్కాం ఇల్లాదవాళ్ ఇంద తెలంగాళ్, అవర్ ఫుల్ అవర్‌ఘళే అడివి కిరార్ఘళ్

ఏమంటాడు వాడు. ళళళ.. అవి బుడబుక్కల వాడి లాగు

సిగ్గులేదట మనకి

సిగ్గులేదా మనకి, అంతమాటన్నాడూ? ఆరు కోట్ల ఆంధ్రుల కవమానం

ఏమయ్యా తెలుగోళ్లకు సిగ్గులేదూ

ఇల్లే ఇల్లె... ఇల్లల్లే ఇల్లె.

వాడి జోలికిపోక, కరిచేస్తాడు. అసలే రావణాసురుడి సంతతి.

అయితే మనమేం తక్కువోళ్లమా? మంది

రామదండు

ఛ అదేంపేరు. రామదండు అంటే కోతులు కాదూ? రాముడికి సాయంచేసినవి కోతులు కాదూ ? మనంకోతులమా? నేను ఛస్తే ఒప్పుకో నామాట.

రాముడుదేవుడు. ఆయనకు సాయం చేసిన వాటిని కోతులని అవమానించకూడదు మనం.

ఇదుగో నేను నాస్తికుణ్ని. నాకీ పుక్కిటి పురాణాలుచెప్పకు. రాముడు దేవుడా వాడికి కోతులు సాయం చెయ్యడమా?

రాములవారిని పట్టుకుని వాడూవీడూ అనకు

దేవుణ్ని వాడూ వీడూ అనడంలో తప్పులేదు లే.

ఆ మాటకొస్తే సినిమా ఏక్టర్లనూ, పొలిటీషియన్లను వాడూ వీడూ అంటాం. అంత మాత్రాన వాళ్లని అవమానించట మవుతుందా? యన్టీవోడు,ఎయన్నార్రోడు, వాడు బిజెపివోడు, వీడు కాంగ్రెస్‌వోడు, మరోడు తెలుగుదేశం వోడూ అని చెప్పుకోమా?

కమ్యూనిస్టు పేరెత్తవేం. నువ్వు కాంగ్రెస్ వాడివా?

నువ్వు కమ్యూనిస్టువా?

అవును ఏం తప్పా?

ఏం బ్రాండుకమ్యూనిస్టువి. రష్యా బ్రాండా, చైనా బ్రాండా?

వాడు బిజెపివాడు లాగున్నాడు.

లాగేంటి? నేను బిజెపినే అయితే ఏంటంటావు?

ఛ నీతో మాట్లాడకూడదు. మత మౌఢ్యం తలకెక్కిన వాళ్లు మీరు.

మీరు తక్కువవాళ్లా? ఈ దేశంనీళ్లు తాగి, తిండి తిని పరదేశాల మతాన్ని కీర్తించేవాళ్లు మీరు.

అంటే కమ్యూనిస్టులు దేశద్రోహులా? బూర్జువా వెధవా?

ఎందుకయ్యా కొట్టుకుంటారు? మన తెలుగోళ్లం. కలిసిమెలిసి వుండాలి.

ఓరి నీ తెలుగుతెగులు తగలడా?

నీ పేరేంటి?

నీకెందుకు నాపేరు

సిఐడి లావున్నాడు మనిషి

పేరడిగితే సిఐడి అంటావేంది?

లేకపోతే నీకు నాపేరెందుకు?

మాటవరస కడిగాను. అదీతప్పే. పోన్లే చెప్పొద్దుగానీ, నలుగురం కలిశాం. స్నేహంగా చాయ్ తాగివెళ్దాం. అయినా ఛాయ్ తాగనేలేదు. వలికిపోయింది.

అరె కోన్‌హై భాయ్ ఇదర్ చార్ చాయ్ లావ్

బేరర్ నాలుగు టీలు తెచ్చాడు. పైసలు సార్ అన్నాడు.

అరె. మేం పారిపోతున్నామా. ఇస్తాంలే.

బేరర్ వెళ్లిపోయాడు.

ఛూ...ఛూ.... అనుకుంటూ టేబిల్‌మీద గోడవారగా ఓ ఎలుక పరుగెత్తింది.

ఇందాక అడిగావుగా ఎవరు వాడని వాడే వీడు.

ఎలుకా?

కాదు. దూలాల మీది దొడ్డ మారాజు

ఎక్స్‌ప్లాయిటర్. చీకటిలో మనుషులను దోచుకునే కాపిటలిస్టు

కాదులేవయ్యా! ఆ టేబిల్‌చివర బ్రెడ్ ముక్క వుందికదా. దాన్ని అందుకోవటానికి పరుగెత్తింది. చీకట్లో నీ కప్పు తన్నేసింది. నేరం నాది కాదు ఆకలిది అన్న సినిమా వచ్చింది చూశావు అట్లా నేరం దాంది కాదు ఆకలిది.

దాన్ని కూడా మన ప్రొలెటేరియన్ క్లాసే నంటావా?

అమ్మా! ఇప్పటికి నీకు సరియైన వర్గ దృక్పథం ఏర్పడుతుంది. మళ్లీ కరెంట్ ఫెయిల్యూర్. టీ తాగి లేచాడు బిజెపి వ్యక్తి.

మీరంతా కమ్యూనిస్టుల్లా గున్నారు. చాయ్ డబ్బు మీరే ఇచ్చుకోండి. నాకేం సంబంధంలేదు అని వెళ్లిపోయాడతను.

ఓరివెధవా? నీ కసలు మానవత్వం లేదురా?

మీకు నాకూ పడదు. మా రాజీవ్ గాంధీని అస్తమానం తిట్టేవాళ్లు, మీరే బిల్లుకట్టుకోండి అని లేచి వెళ్లిపోయాడు మరొకతను.

కాంగ్రెసోడు పోయాడు, మనమూ పొదాం పద గురూ బేరరొచ్చే లోపల ఇద్దరూ లేచి రెస్టారెంట్ బయటకొచ్చారు.

ఏంది గురూ మంది సిపిఐయ్యా, సిపియమ్మా. తెలుగుదేశం

పోన్లే మిత్రపక్షమేగా చూశావా, ఎక్కడ చూసినా దోపిడీ, దగా, మోసం, ఈ కాంగ్రెసోళ్లను, బిజెపి వోళ్లనూ నమ్మకూడదు.

బిజెపి వాడి సంగతి వేరులే.

సరేకాని నీ మాటెందుకు కాదనాలి అన్నాడు మిత్రపక్షి.

దూలాలమీది దొడ్డమారాజులు నల్గురూ ఎవరితోవన వాళ్లు వెళ్లిపోయారు.

బద్మాష్ కే బచ్చే! పైసే నై దియే వో లోగ్. చలేగయే. ఫిర్ క్యాకర్తా రహే రే హరాంఖోర్! అని తిడుతున్నాడు ఇరానీ హోటల్ వోనరు బేరర్ని.



# నార్ల మాట

ఏ పురాణమైన ఏవో కూ తలు కూయు
నీతిగూర్చి శూద్రజాతిగూర్చి
ఏ పురాణమైన ఏ బ్రాసి రచనరా!
నవయుగాలబాట! నార్లమాట!

శాపము తగిలించ చనిపోవరెవ్వరు
వరమునివ్వ బ్రతుకువారు లేరు
పాత్ర వ్రాతలెల్ల కూతలే కోతలే!
నవయుగాలబాట! నార్లమాట!

ప్రతి పురాణగాథ బ్రాహ్మణ భక్తుల
సంఖ్యపెంచు, వారి శ్రద్ధ పెంచు
భక్తబృందమున్న భుక్తికి శ్రమతప్పు
నవయుగాలబాట! నార్లమాట

మధ్యయుగమునాటి మసిపూత పోకున్న
పూర్వయుగమునాటి బూజుమిగులు
ఆధునిక యుగమ్ము అడుగైన పెట్టునా?
నవయుగాలబాట! నార్లమాట!

చచ్చి శవములైన సంప్రదాయమ్ములు
నరుని రేపుదిశకు నడపలేవు
రాతి హయములెట్లు రథమును నడపురా
నవయుగాలబాట! నార్లమాట!

అచ్చుపడినదెల్ల అచ్చ నిజముకాదు
పచ్చికల్లలుండు అచ్చులోన
నిగ్గుదేల్చినపుడె నిజమేదొ తేలురా!
నవయుగాలబాట! నార్లమాట!